జాతీయ రక్షణ నిధికి విరాళం



సంఘీభావం తెలుపుతున్న క్రాంతి కీన్ అకాడమీ టీచర్లు

కీసర: జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేసిందని దమ్మాయిగూడ క్రాంతి కీన్ అకాడమీ వ్యవస్థాపకుడు పీఎస్ఆర్. క్రాంతి అన్నారు. ఘటనలో మృతిచెందిన నిరపరాధ ప్రజలకు సంఘీభావం వ్యక్తం చేస్తూ వారి కోసం జాతీయ రక్షణ నిధికి అకాడమీ ఆధ్వర్యంలో రూ.11 వేల విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే విద్యార్థులతో కలిసి దేశం కోసం ప్రార్థన, ఐక్యత సంతకం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోహణ-2025' వార్షిక మహోత్సవానికి రండి



జేఎన్టీయూహెచ్ వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రశాంత్, సుధీర్ ప్రేమ్‌కుమార్

ఘట్‌కేసర్: ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న 'ఆరోహణ–2025' వార్షిక మహోత్సవానికి హాజరుకావాలని ఆ కళాశాల వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్ కోరారు. ఈమేరకు జేఎన్టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాడికొండ కిషన్‌కుమార్‌రెడ్డిని గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, విద్యార్థుల అభివృద్ధిపై చర్చించారు.

బట్టతలకు మందు అంటూ లేపనం..

విక్రయించిన ఇద్దరిపై కేసు నమోదు

ఉప్పల్: బట్ట తలకు మందు అంటు వందలాది మందిని అనుమతుల్లేకుండా గ్యాదర్ చేసిన ఇద్దరు నిర్వాహకులపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బట్టతల మీద జుట్టు మొలిపిస్తామంటూ లేపనం, షాంపులు విక్రయించడంతో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ప్రజలను గ్యాదర్ చేసిన నిర్వాహకులు సూర్యపేటకు చెందిన హరీశ్, ఢిల్లీకి చెందిన ఆయుర్వేద డాక్టర్ సల్మాన్‌పై ఉప్పల్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు పోలీస్ అదుపులోనే ఉన్నట్లు సమాచారం.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

మల్కాజిగిరి: పోక్సో కేసులో యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. మౌలాలి గాయత్రీనగర్‌కు చెందిన మంద సాయికిరణ్‌రెడ్డి (28) వ్యాపారి. సాయికిరణ్ రెడ్డి లైంగిక దాడికి పాల్పడమే కాకుండా పెళ్లి చేసుకుంటానని మోసగించారని ఈనెల 11న బాధితురాలు కుటుంబసభ్యులు మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న సాయికిరణ్‌ను గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సాయికిరణ్ ప్రముఖ రాజకీయ పార్టీ నాయకుడిగా ఉన్నట్లు సమాచారం.

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం



భోజనం చేస్తున్న మాజీ కార్పొరేటర్ తదితరులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి శివసాయినగర్‌లోని సన్నబియ్యం లబ్ధిదారు బాలమణి నర్సింహ ఇంట్లో గురువారం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, పెద్ది నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రకాశ్, అరుణ్, ఉమేశ్, రాజేశ్, శ్యామల, శ్రావణి, శ్రీవాణి, రమాదేవి, ఎల్లమ్మ, పద్మసాయి, లక్ష్మి, సంధ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

కాప్రా: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలో గురువారం తానే స్వయంగా సభ పోస్టర్లను అంటిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్
- జయమోహన్ గార్డెన్‌లో రైతులకు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మండలంలోని చీర్యాల చౌరస్తాలోగల జయమోహన్ గార్డెన్‌లో వివిధ గ్రామాల రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ వల్ల ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఉద్యోగులు, నిపుణులతో చర్చించి ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు, హక్కులు లేకుండా ఉండేదని దీంతో ప్రతి సమస్యకు రైతులు కోర్టుకు వెళ్లాల్సి ఉండేదన్నారు. అయితే కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేలా వెసులుబాటు కల్పించామన్నారు. భూ భారతిలో ఆధార్ తరహాలో భవిష్యత్తులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించి, సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురానున్నదని అది విజయవంతమైతే భవిష్యత్తు తరాలకు ఎలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండబోవన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని, త్వరలో అన్ని జిల్లాలోనూ అమలవుతుందని, అప్పుడు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, కొత్త చట్టం వల్ల రైతులు ఏండ్ల నుంచి ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. అంతకుముందు సదస్సులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

గ్రామాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను రైతులు సదస్సులో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కీసరదాయర రెవెన్యూ పరిధిలో రెండు పంటలు పండే పట్టా భూములను ఎలాంటి ఆధారాలు లేకున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కమ్మరి చెరువు భూములుగా ఇటీవల రికార్డుల్లో నమోదు చేశారని, దీంతో సన్న, చిన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. సేత్వార్, కాస్రా పహాణీ నుంచి ఇప్పటివరకు భూరికార్డులు, విలేజ్ మ్యాప్, సర్వేఆఫ్ ఇండియా తోఫోషిట్, గూగుల్ మ్యాప్‌లో కూడా తమ భూములు చెరువు భూమిగా లేదని ఆధారాలను అందించి న్యాయం చేయాలని విన్నవించారు. ఇదే విషయమై 6 నెలలుగా రైతులు అధికారుల చుట్టూ తీరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇక బర్సిగూడ గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే రాంపల్లిదాయరలో ప్రభుత్వం, ప్రైవేట్ భూములకు సంబంధించి హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని రైతులు విన్నవించారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'



కార్యక్రమంలో ప్రతినిధులు తదితరులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్, బ్లూ పీటర్ పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ల ఆధ్వర్యంలో గురువారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఉష్ణ మండల వ్యాధుల వ్యాప్తి, నిర్ధారణలో తాజా ధోరణులు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 160 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ ఉపాధ్యక్షురాలు డా. ప్రీతిరెడ్డి ఎఫ్‌డీపీ ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, పరిశోధకులకు నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధుల్లో తాజా ధోరణులు, నిర్ధారణ పద్ధతుల పురోగతి, పరిశోధనా అవకాశాలపై అవగాహన పెంచేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పలు సెషన్లలో యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి (యూకే) నుంచి డా. సందీప్ చైతన్య వేదిథి ×నిర్లక్ష్య ఉష్ణ మండల వ్యాధుల ఆధునిక మలిక్యులర్ నిర్ధారణ పద్ధతులపై, డా.అపర్ణ శ్రీకాంతం 'ప్రపంచ మరియు భారతదేశంలో ఉష్ణ మండల వ్యాధుల ప్రస్తుత స్థితి' మరియు డా.సురేశ్ మునుస్వామి 'ఉష్ణ మండల వ్యాధుల్లో డిజిటల్ ఆరోగ్య సాంకేతికతల వినియోగం' అనే అంశాలపై ప్రసంగించారు. డా. శృతి కొండూరు వాష్ (నీరు, పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత) వలన నిర్లక్ష్య ఉష్ణ మండల వ్యాధుల నివారణ౯ పై ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

మేడ్చల్ డిపో నుంచి దేవస్థానాలకు ప్రత్యేక బస్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ సమీపంలోని దేవస్థానాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మేడ్చల్ ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది. డిపో నుంచి ప్రతీ ఆదివారం 7 గంటలకు మేడ్చల్ నుంచి ప్రారంభమయ్యే బస్సు సిద్దిపేట జిల్లా పరిధిలో ఉన్న బద్రీనాథ్ టెంపుల్, వర్గల్ సరస్వతి ఆలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయాల దర్శనాల అనంతరం శామీర్‌పేట్ మండల పరిధిలోని రత్నాలయం చీర్యాల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, భువనగిరి స్వర్ణగిరి టెంపుల్ దర్శనాల అనంతరం రాత్రి 8 గంటలకు మేడ్చల్‌కు తిరిగి చేరుకుంటుందని డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ప్రయాణికులకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 చార్జీ ఉంటుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మాజీ సర్పంచ్‌పై భూ కబ్జా కేసు

పోచారం: చౌదరిగూడ మాజీ సర్పంచ్‌పై పోచారం పోలీస్ స్టేషన్‌లో భూకబ్జా కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన మధుకుమార్, రామచంద్రారెడ్డి జాయింట్‌గా కొర్రెముల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 751లో 5525 చదరపు గజాల భూమిని 2006లో కొనుగోలు చేశారు. ఇందులో రేకుల గది నిర్మించి, మిగిలిన ఖాళీ జాగాలో చెట్లు పెంచుతున్నారు. కాగా, తమ స్థలంలోకి ముక్కర్ల మంజుల, హీరకలతాబాయి, బైరు విఘ్నేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్ తన అనుచరులతో ప్రవేశించి కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. కొంత స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మధుకుమార్‌ను బెదిరించారు. దీంతో మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'మహిళా అందాల పోటీలను రద్దు చేయాలి'



అభివాదం చేస్తున్న ప్రజా సంఘాల నాయకురాళ్లు

జవహర్‌నగర్: రాష్ట్రంలోని అన్నదాతలకు రైతుబంధు ఇవ్వలేని ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించడం ఏంటని, వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 72వ ప్రపంచ మహిళా అందాల పోటీలను నిరసిస్తూ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో ప్రజా సంఘాల నాయకురాళ్లు లక్ష్మీబాయి, పుణ్యవతి ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలు ఎండిపోయి రైతులు చనిపోతున్నారని, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఇలా ఎన్నో సమస్యలు ఉండి రాష్ట్ర ప్రజలకు ఎంతమాత్రం ప్రయోజనం లేని అందాల పోటీలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని దుయ్యబట్టారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు జయ, సావిత్రి, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ, స్వరూప, మహిళలు వినోద, విజయ, గిరిజ, శారద తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల నివారణకు చర్యలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో రానున్న వర్షాకాలంలో ముంపు ప్రాంతాల నివారణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ శైలజ అన్నారు. ముంపునకు గురయ్యే బచపన్ స్కూల్ సర్కిల్ నుంచి పీఎస్ఆర్ కాలనీ, బీఎల్‌నగర్, ఎస్‌బీఆర్ కాలనీ, అమ్మసాని కాలనీల్లో గురువారం ఆమె పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన పైపులైన్ పనులు చేపట్టి జూన్ మొదటి వారం లోగా పూర్తి చేసి మురుగునీరు, వర్షపు నీటిని ప్రధాన కాల్వకు మళ్లిస్తామన్నారు. అలాగే ఈనెల 30 లోగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు (ఎర్లీబర్డ్ స్కీం) ద్వారా చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ప్రతినిధులు పోగుల దిలీప్‌రెడ్డి, కె. శ్రీనివాస్‌రావు, వెంకటేశ్, శంకర్‌గౌడ్, సంజీవ్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వెంకటాపురంలో సూర్యకిరణ్, వీనస్ మేరీ, దేవేందర్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం అల్వాల్ సర్కిల్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు దేవేందర్ జన్మదినోత్సవం సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మ అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్, కిట్టు, శేఖర్, బలవంతరెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, శివసాయి, వీనస్ మేరీ, పద్మ, భబిత, గాయత్రి, శశికళ, నిర్మల పాల్గొన్నారు.

మున్సిపల్ నర్సరీని పరిశీలించిన హైడ్రా అధికారులు



ఘట్‌కేసర్ మున్సిపల్ నర్సరీని పరిశీలిస్తున్న హైడ్రా, రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో అధికారులు ఏర్పాటు చేసిన నర్సరీని హైడ్రా తహసీల్దార్ హేమమాలినీ, ఇన్‌స్పెక్టర్ సైదులు గురువారం పరిశీలించారు. ఇటీవల నర్సరీ భూమి తనదంటూ ఓ వ్యక్తి నర్సరీ గేటుకు తన పేరు రాసుకుని కబ్జాకు యత్నం చేశాడు. వెంటనే స్పందించిన అధికారులు ప్రైవేట్ రాతలు తొలగించారు. అలాగే నర్సరీ కబ్జా యత్నంపై స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయగా వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీ మున్సిపాలిటీ ఆధీనంలోనే ఉందని స్థానిక అధికారులు వారికి తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్ రికార్డులు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరి దగ్గరైన రికార్డులు ఉంటే హైడ్రా కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వ్యక్తి, స్థానికుల మధ్య వాగ్వాదం జరిగింది. వారి వెంట ఆర్ఐ సాయిరాం, టీపీఎస్ సందీప్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మేడ్చల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ సూచించారు. స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లకు గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోకు నలువైపులా కనిపించేలా నంబర్ ప్లేట్లు ఉండాలని, డ్రైవర్లు తప్పకుండా యూనిఫారం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు. సమావేశంలో అన్ని యూనియన్ల ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనర్సింహాస్వామి గ్రామోత్సవం





కీసర: చీర్యాలలో లక్ష్మీనర్సింహాస్వామి 17వ వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా జరిగాయి. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలోని పురవీధుల గుండా ఆలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, మాజీ ఎంపీపీ ఇందిరా, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి: రైల్వే సమస్యల పరిష్కారానికి ఎంపీ ఈటల రాజేందర్ కృషి చేస్తున్నారని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. ఎంపీ పర్సనల్ సెక్రటరీ రాజుతో కలిసి ఎంపీ రాసిన లేఖను దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ డీజీఎం ఉదయ్‌కుమార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయ్‌నగర్ ఆర్‌యూబీ, ఆనంద్‌బాగ్‌లో నూతన రైల్వేస్టేషన్ల ఏర్పాటు, ఇప్పటికే పూర్తయిన ఆర్కేనగర్ స్టేషన్‌తో పాటు బుకింగ్ కౌంటర్ ప్రారంభంతో పలు సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం పక్కనున్న గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నల్ల రిబ్బన్లు ధరించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అలాగే మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ..

కీసర: కాంగ్రెస్ ఆధ్వర్యంలో చీర్యాల చౌరస్తాలో గురువారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నేతలు కొళ్ల కృష్ణయాదవ్, రాముడు, విజయ్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహులు యాదవ్, కందాడి శివరాంరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో..

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ దమ్మాయిగూడకు చెందిన పలువురు కాలనీవాసులు దమ్మాయిగూడ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

మేడ్చల్ రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామంలో సీనియర్ సిటిజన్స్ నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు వరప్రసాదరావు, అపార్ట్‌మెంట్ మాజీ అధ్యక్షుడు భక్తవత్సలరావు, ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యదర్శి వల్లభేంద్రరెడ్డి, కోపరేటివ్ సొసైటీ ట్రెజరర్ శేషాసాయి, కుమారస్వామి, నిర్మల, చంద్రకాంతారావు తదితరులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ..



చీర్యాల చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం..



కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న సీనియర్ సిటిజన్స్, సాకేత్ నివాసితులు